ఉ: పక్క గదిలో నిద్రపోతోంది. వెళ్లి చూసుకోండి.

ర: వదలను వీణా. ఉమేష్ నువ్వింత దుర్మార్గుడి వవుతావనుకోలేదు. నీలో యింత రాక్షసత్వం యిమిడివుందని యేనాడూ ఊహించుకోలేకపోయాను. మన వంశానికే కాదు—మానవత్వానికే మాయనిమచ్చ తీసుకొచ్చావు నువ్వు. నువ్వింత క్రూరుడివి...ఇంత నరరూప రాక్షసుడివి...అని అనుకోలేదు నేను.

ఆగు...ఆ రూమ్‌లోకి జారుకుంటావేం? మళ్ళీ యెవళ్ళ మొహంమీద యాసిడ్ చిమ్మి శాశ్వత నిద్రకి జో కొడదామనుకుంటున్నావ్.

ఉ: ఎవర్నీ కాదు. నేనే నిద్రపోవటానికి.

ర: ఆగు. ఆ యింజక్షను క్రింద పారెయ్యి. తమ్ముడూ! పశ్చాత్తాపం పొందే విధం కాదిది.

ఉ: 'అబ్బా' అన్నయ్యా! నన్ను 'తమ్ముడు' అని చల్లగా పిల్చావ్, నా కదే చాలు. నేను చేసిన ఘోర పాపాలకి యిదే పర్యవసానమే కాదు-పశ్చాత్తాపమూ, ప్రాయశ్చిత్తమూ కూడాను. సుమతి ప్రాణాలు చేతులారా తీసాను. ఆమె పాలిటి మృత్యుదేవతనయ్యాను. మీ రందరూ నన్ను క్షమించండి. అన్నయ్యా, మన ఆస్తికి సంబంధించిన కాగితాలు ఐరన్ సేఫ్‌లో వున్నాయ్. తీసుకో. వీణకు నేను చేసిన అపరాధానికి-వీణా నన్ను క్షమిస్తావు గదూ. అన్నయ్యా-వీణయిక నా వదిన. నా...అబ్బా.'

వీ: ఏమిటి రమేష్. మీ యిద్దరూ అన్నదమ్ములా.

ర: అవును. వ్యతిరేక ధృవాలంగూడాను. వీణా మా జీవితంలో అన్ని రంగాలూ సమాప్తి అయినై. ఇవ్వాళ రెండు శవాల మధ్య రెండు జీవాల జాగరణ.

(కిటికీ రెక్కలు తీసుకుని 'జూవ్వ' మని గాలి ప్రవేశించిన చప్పుడు. కిటికీ తలుపులు గోడ తెరిపి లేకుండా కొట్టుకుంటున్న ధ్వని.)

స్కెచ్

# మనస్సు ఇచ్చిన సందేశం

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు

కవి మనస్సును కథలకోసం అన్వేషించమన్నాడు. అన్వేషించి, అన్వేషించి సెన్సు మీద చక్కని కథను తెగలిగింది మనస్సు. కవి, కథను పరీక్షలో పెట్టాడు. పెదవి విరచాడు. "ఏం?" అంది మనస్సు. "నచ్చలే"దన్నాడు కవి.

కవికి కావలసినకథ అదికాదు. పేదలదీనాలాపాలతో నిండినదిగానో, పాలకుల నిరంకుశత్వపు చర్యల తెలిపేదిగానో, పాలితుల బాధలను, క్షుదార్తులఆక్రందనలనుసూచించేదిగానో, మతోన్మాదులక్రూరత్వాన్ని నిరూపించేదిగానో, విశ్వకళ్యాణాన్ని చేకూర్చడానికి సహకరించేదిగానో వుండాలి. ఇటువంటి సెన్సురు సంబంధించిన కథలను వ్రాయటం అతనికి సుతరామూ యిష్టంలేదు. ఇన్నాళ్లనుండి, తనొక అభ్యుదయాన్నాశించే, రచయితగా పేరొందాడు. అటువంటి తనిప్పుడిటువంటి కథను, లోకానికేవిధంగా వుపయోగం లేనిదానిని, పైపెచ్చు లోకాన్ని అధోగతి పాల్జేసేదాన్ని సృష్టించి, తన కథలకోసం,గీతాలకోసరంఎదురుచూచే(తనదృష్టిలో) లోకాన్ని వంచించడమా! లోకాన్ని మోసం చెయ్యడం, తన్ను తాను మోసం జేసుకోవటమే. నిరంతరాభ్యుదయకామియయిన, తనటువంటిదాన్నాచరించి, ఆత్మ విద్రోహానికి పాల్పడతాడా? అయినా, ఎన్నడూ లేనిదీనాడిట్లు పెడదారి పట్టిందేమిటి తన మనస్సు? ఒకనిముషమాత్రమాలోచించి, ఒక దీర్ఘనిశ్వాసాన్ని ఒదిలాడు. కళ్లు గట్టిగా మూసుకొని, మొఖాన్ని ఊర్ధ్వంగా త్రిప్పాడు.

"ఏమి తెలుస్తా"వంది మనస్సు.

కథను చేరిపేసి, మళ్ళా అన్వేషణార్థం బయలుదేరమన్నాడు.

"గంటలతరబడి జేసినశ్రమ నిష్ఫలమేనా?" ప్రశ్నించింది మనసు.

"నిస్సందేహంగా" జవాబిచ్చాడు కవి.

ఈసారొక గీతా న్నందించింది మనస్సు. "కొన్ని వెన్నెల రాత్రుళ్లు హాయిగా, గడిపిన తరవాత ఇద్దరికీ ఎడబాటు సంభవించగా ఎడబాటును సహించలేని ప్రేయసి మరణించంగా, గతాన్ని స్మరించుకుంటూ, ఆమెకోసం విలపించే, ప్రియుని, భగ్న హృదయపు రోదన" ఆ గీతంలోని సారాంశము.

"ఈసా రేమంటావ్?" ప్రశ్న వేసింది మనస్సు.

"ఎవరి కుపయోగం ఈ గీతం" అన్నాడు కవి.

తీవ్రరూపం దాల్చింది మనస్సు. యిన్నాళ్ల నుండి నీవు రాసినవన్నీ యెవరి కుపయోగించినయి? యే విధంగా ఉపయోగించినయ్?"

త్రుళ్ళిపడ్డాడు కవి. "లోకానికి అందులో ముఖ్యంగా, నిరుపేదల దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు, పాలకుల దౌర్జన్యాన్ని రూపుమాపేందుకు, క్షుదార్తుల క్షోభను నశింపజేసేందుకు, అన్యాయాన్ని పారద్రోలేందుకు. విశ్వమానవ కళ్యాణం చేకూర్చేందుకు..." పెద్ద వుపన్యాసాన్నిచ్చాడు కవి.

"గొప్పవాడివి. నీ రచనలవల్ల ధన్యత జెందిందంటావా లోకం? పాలకుల దౌర్జన్యాలు, పాలితుల దీనత్వాలు మాశినయ్యంటావా? క్షుదార్తుల క్షోభలు, నిరుపేదల దారిద్రాలు సమశాయంటావా? మానవజీవితాలు నవ్యపథాన నడిచాయా? అభ్యుదయమార్గాలు బోధించావు. విప్లవపంథాలు నిర్వచించావు. నిరాశకు తావీయరాదన్నావు. ప్రశాంతమైన మానవలోకమును నిర్మించాలన్నావ్. కౌగితాలు చెడరాశావ్. పుస్తకాలు దొర్లించావు. నీవు వ్రాసినవాటివల్ల, నీవు చెప్పేవాటివల్ల ఏమయినా ఫలితం చేకూరిందా? మచ్చుకు ఒక్కరిలోనైనా చైతన్యాన్ని చేకూర్చగలిగావా? విశాలజగత్తులో నీ ఆశయాలు ఎంతవరకు ఫలోన్ముఖాలయ్యాయో యోచించు. నీవింకా నూరేళ్లుకాదు వెయ్యేళ్లు వ్రాసినా, ఎన్ని సభలలో వుపన్యసించినా, ఎన్ని సానుభూతి వాక్యాలు పల్కినా, అంధకారం తొలగదు. అరుణోదయం కాదు. నీ జీవితం సఫలత జెందదు. నీ ఆశయాలు ఫలించవు."

"ఎప్పుడు మానవజీవితం చైతన్యవంత మవుతుంది? ఎప్పుడు దీనులకనుకొలకులనుండి, దుఃఖాశ్రువులు అంతరించుతాయి? ఆనందబాష్పాలు విరజిమ్ముతాయి. మానవహృదయాల్లో నిరాశకు తావు లేకుండా పోయి. వాస్తవమయిన ఆశాసౌధాలు నిర్మించబడేదెప్పుడు? విశ్వమానవ కళ్యాణానికి ఆలవాలమైన నవ్యజగత్తు ఏర్పడే దెప్పుడు? పాలకుల ఇనుపసంకెళ్ళను త్రెంచివేసి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను బానిసలెప్పుడు పొందగల్గుతారు. అజ్ఞానతిమిరా లంతరించి, లోకాన విజ్ఞానపు వెలుగు లెప్పుడు వ్యాపించుతాయి?"

"ఏనాడయితే నీవు వ్రాసినవాటికి క్రియారూపాన్నిస్తావో ఆనాడే. నీవు నిజంగా విశ్వమానవ కళ్యాణాన్ని ఆశించేవాడివయితే, నీ రాతకోతలు కట్టిపెట్టు. ఏదయితే నీవు వ్రాయదల్చావో, దాన్ని చేతనారూపంలోనికి మార్చు. దేశంకోసం నడుంకట్టి నిలబడు, అంధకారబంధురమైన చీకటిలో దారితెలియక అల్లాడేవారిని వెలుగులోనికి తీసుకొనిరా. దేశంకోసం నీ ప్రాణాన్నయినా సరే అర్పించు, ఆనాడే లోకం నిన్ను గుర్తిస్తుంది. ఆనాడే నీవు తరించగలవు. 'నేను చెప్పింది, మీరు చెయ్యండి' అని మాత్రం అనకు. నీవేనాడయితే కార్యోన్ముఖుడవవుతావో, ఆనాడే లోకం నిన్ననుసరిస్తుంది. అంతేగాని నీ వెర్రిమొర్రి రాతలవలన లోకాన్ని మార్చాలని చూడకు" మనస్సు. సందేశాన్నిచ్చింది.

కలత నిద్దరలోనుంచి కన్నువిచ్చి చూశాడు కవి. ఆకాశంలో మేఘాల తెర వొత్తిగించుకొని, అప్పుడే బయటకు వస్తున్నాడు చంద్రుడు. ఎచ్చటికో బయలుదేరాడు కవి. బహుశా మనస్సాదేశించినచోటికై వుండవచ్చు.